# అమ్మా, ఇక సెలవు

అమ్మా! నేను ఇలా కాకుండా ఇంకో విధంగా నా జీవితాన్ని తీర్చిదిద్దుకునే అవకాశం నాకు ఎప్పుడూ లేదు. దానిక్కారణం నీవు!

నేనంటూ పుట్టి భూమ్మీద పడకముందు నుంచీ నీతోనే ఉన్నాను కదా! నీవే నాకు లోకమైపోయావు. ఎప్పుడూ నా వెనుక, నా చుట్టూ, నాతోనే ఉంటావన్న నమ్మకం జీర్ణించుకుపోయింది నాలో, నీ మార్గమే నా మార్గమైపోయింది.

నీవు బ్రతకటం చూచి బ్రతకటం ఎలాగో గ్రహించుకున్నాను. ఎప్పుడూ పనుల్లో పరుగెత్తే నిన్ను చూచి బరువులు మొయ్యటమే ఆడ బతుకని అర్థం చేసుకున్నాను. నాకు రెండో కాన్పు చేసి నీవు వెళ్ళిపోతున్నప్పుడు ఎడబిడ్డనీ, పసికందునీ, ఇంటిల్లిపాదికీ నేను చేసి పెట్టవలసిన పనుల్నీ, తీర్చవలసిన అవసరాల్నీ తలచుకుని భయపడుతున్న నాతో అన్నావు - "పనిని చూసి ఆలోచన చేయకూడదు, భయపడకూడదు. చేసుకుంటూ పోవాలి. అన్నీ అవే జరిగిపోతాయి!" అన్నావు. నీవు చెప్పినట్లే చేశాను. నేను తలచుకుంటే చెయ్యలేనివి, చెయ్యలేనని భయపడ్డవీ పనులన్నీ ఎలాగో జరిగిపోయేవి. ఆడవాళ్ళు రాత్రీ పగలూ అనుకోకుండా, లెక్క పెట్టుకోకుండా ఎన్నో పనులు చేసుకుపోతారు - ఇట్లాగేనేమో!

నాకు జీవితంలో ఎదురైన అనుభవాలన్నీ వాటంతట అవే నన్ను చుట్టుముట్టి, స్పృశించి, కౌగిలించుకుని, నాతో మమేకం అయిపోయినవి, వేటి గురించీ నేను ఆలోచించకుండానే. నా వెనుక ఎక్కడో నీవు ఆకాశమంత అండగా, భూదేవంత ఆధారంగా నిలబడి ఉన్నావన్న స్పృహ నా పసితనంలో ఎలా ముందుకు నడిపించిందో చివరిదాకా ఆ బలం నన్ను వెన్నంటే ఉంది! ఈ ప్రపంచంలో ఒక ప్రత్యేక జీవిగా - అందునా స్త్రీగా నేను ఎదుర్కొంటున్న సంఘర్షణలు, అన్యాయాలు అన్నీ ఎంత సులువుగా, ఎంత అనాలోచితంగా స్వీకరించాను!

నేను దేనిముందు తలవంచాను, దేన్ని నమ్మాను - సంప్రదాయాన్నా, సంఘాన్నా, నిన్నా? ప్రేమ, త్యాగం ఎక్కడున్నాయో దాన్ని గౌరవించడం, నమ్మడం, దానికి తలొగ్గటం మానవ సహజం. ఆ పవిత్రతా భావం మనిషికి వినమ్రతా, ఆనందమూ ఇస్తుంది. అది

చెదిరితే మిగిలేది లాభనష్టాల వ్యాపార దృష్టితో చలించే మనస్సు మాత్రమే!

చెప్పి చెప్పకా ఇన్ని నేర్పించినదానివి ఒకరోజున నీవు వెళ్లిపోతావన్న విషయం ఎప్పుడూ సూచించలేదెందుకు? మరణం అన్నది ఎవరికి వారు అనుభవించి, తెలుసుకుని ఎదగాల్సిన విషయం కనుక నీవు చెప్పలేదేమో! ఆ హాస్పిటల్లో నెల రోజులు నిన్ను దక్కించుకోవాలని ఎంత పోరాడాను! ఎంత బాధ! ఎంత దుఃఖం! ఎంత ఆదుర్దా! కాని ఇప్పుడు నాకు తెలుసు - మనుషులు పుడతారు. ఎప్పుడో ఒకసారి చచ్చిపోతారు. మనిషి పుట్టడం ఎంత సహజమో, చచ్చిపోవడమూ అంత సహజమని చూపించావు. ఎంత ప్రశాంతంగా, ఎంత సహజంగా చచ్చిపోయావు! చావులో భయం లేనే లేదు! పండుటాకులు రాలడంలో, ఎండు కొమ్మల్ని తుంచేస్తే చెట్టు బలం పుంజుకోవడంలో ఏ ప్రకృతి సూత్రం ఉందో, మనిషి శరీరం రాలిపోవడంలోనూ ఒక పరమార్థం ఉండే ఉంటుంది!

ప్రపంచంలో అనేక రకాల బాధలూ, దుఃఖాలూ ఉండొచ్చు, మనిషి ఎదుగుదలలో వాటి అవసరమూ ఉండొచ్చు. కాని కేవలం నిర్లక్ష్యం వలన, బాధ్యతా రాహిత్యం వలన మనిషిని మనిషి పెట్టే బాధ నా కర్థం కావడం లేదు. కారణం తెలియడం లేదు.

అమ్మా! ఈ నలభై ఏళ్లలోనూ నేను నిన్ను ఎప్పుడూ గమనించి చూడలేదు. ఈ ఐ.సి.యు.లోనే మొదటిసారిగా చూశాను. ఏదైనా గట్టి ఊపు వస్తేనే గాని వాస్తవాన్ని గుర్తించలేని స్థితికి చేరింది సమాజం. నేనూ అంతే!

నీవు శక్తులుడిగి మంచం పట్టాక చాలా తెల్లగా, ఏకులాగా అయ్యావు. నిరంతరం శ్రమతో మొద్దుబారి చీలికలు వచ్చేసిన నీ పాదాలూ, చేతులూ ఇప్పుడు లేత గులాబీ రంగులోకి మారిపోయాయి. నీవు ఎప్పుడూ పనులతో హైరానాపడుతూ, సతమతమైపోతూ విసుగ్గా ఉంటావనీ, బండ పనులు చేసుకుంటూ ఉండటం నీ నైజమనీ, మేమందరం తినగా మిగిలింది తినడం నీ స్థాయి అనీ, పొగచూరు కట్టెల పొయ్యిలూ, అంట్ల గిన్నెలూ, హడావుడి, అలసిపడిపోయిన బండనిద్దురా - ఇదే నీ రూపమనీ నా స్మృతిపథంలో లిఖితమైపోయింది. నీ అమాయకత, బాధలూ, బరువులూ అన్నీ నీ అజ్ఞానం, చేతగానితనాలకు సంబంధించినవనీ, నీ విసుగు నీ రాక్షసత్వమనీ గుర్తించుకున్నాం చిన్నతనంలోనే. నీకు సహాయం చేయాలనీ, సానుభూతి చూపాలనీ, నీవు మోస్తున్నవన్నీ నిజంగా మా బరువులనీ తెలియనేలేదు! నీవు మీ అమ్మకు గారాబు పుత్రికవనీ, చాలా సుకుమారంగా వుండేదానివనీ చిన్నప్పుడు విన్నాను కథలాగా. మంచాల చాటున దాక్కుని స్నేహితులతో అచ్చనగాయలూ, వామనగుంటలూ ఆడి, బడి ఎగ్గొట్టి, చదువుకు అయిదో క్లాసుతోనే ఎగనామం పెట్టేసిన వెర్రితనం గురించీ, మూలన పడేసి వున్న పాత హార్మోనియం

పెట్టె ముందు కూర్చొని నీవు పాడిన పాటల గురించీ నాన్న వేసే జోకులకు ఎంతగా నవ్వుకునేవాళ్లం!

అందుకే నీ కూతుళ్లం నేనూ, సరూ, చిన్నారి బాగా చదువుకున్నాం. చిన్నారి అమెరికాలో డాక్టరుగా ఉన్నది. నీ కాలాన్ని దాటి మేము చాలా ముందుకు వచ్చేశాం. కాని అమ్మా! చదువుకోని నీకూ, చదువుకున్న మాకూ కుటుంబ పరిస్థితుల్లో ఏమీ భేదం రాలేదు. ఎందువలన? నీ ప్రేమగాని, నీవు మాకోసం ఎంత చేస్తున్నావు, ఎందుకు చేస్తున్నావు అనిగాని మాకు తెలియనివ్వని పరిస్థితులు ఎలా ఏర్పడ్డాయి? మేమందరం నిన్ను నిర్లక్ష్యం చేసినా, ఎగతాళి చేసినా లెక్కపెట్టకోకుండా, తొణక్కుండా కర్మయోగిలాగా నీ పనులు ఎట్లా చేసుకుపోయావు? చదువులతో సంబంధం లేని ఆ పెన్నిధి నీలోకి ఎట్లా వచ్చి చేరింది? ఆ బీజ మంత్రం కనుక్కోగలిగితే ప్రపంచమే స్వర్గం అయిపోతుంది గదా!

నీ శరీరం పంచుకుని మేము పుట్టామని మొదటిసారిగా అనుకున్నాను ఇప్పుడు. నీ శక్తి సామర్థ్యాలు వినియోగించావు గనుకనే సంపూర్ణమైన నిస్సహాయ స్థితి నుంచీ మేము బలం పుంజుకుని పెరిగామని కృతజ్ఞత కలుగుతున్నది ఇప్పుడే. 'నీది'గా మేము గుర్తించిన బండ చాకిరీ వెనుకనున్నది మాకేమీ తక్కువ కాకూడదన్న తపనేనని, ఇప్పుడే గుర్తించాను. నీ ఆత్మని మాకర్పించావన్న రహస్యం ఇప్పుడే, ఈ ఐ.సి.యు.లోనే, నీ కోమా కలవరింతల్లోనే నాకు తెలిసింది. నేను ఇంతకు ముందు గమనంలోకి తీసుకోనివీ, నిర్లక్ష్యంగా వదిలేసినవీ అనేక సంఘటనలు ఇప్పుడు స్మృతిపథంలోకి వస్తున్నవి. ఎక్కడో వాస్తవాన్ని మరుగుపరుస్తున్న ఘోరమైన పొరపాటు ఉన్నది! మానవ సంబంధాల్లోకి పుచ్చు వచ్చి చేరింది. అమూల్యమైనదేదో జారిపోతున్నది! చిన్న పరిధిలో, కుటుంబ బాంధవ్యాల్లో నిలుపుకోలేని సంబంధమూ, ఆర్ద్రతా, ప్రేమా విస్తృతమైన సమాజ పరిధిలో ఊహించబోవడం ఉట్టికెక్కలేనమ్మ స్వర్గానికెక్కాలని ఆశించిన చందాన అవాస్తవికం అవుతుంది కదా! అంత కృతఘ్నతను ఎలా సహించావు? ఏ ఎత్తున నిలబడి నీ బరువులను ఒంటరిగా లాక్కొచ్చావు?

అవును! ఒంటరితనం గురించి ఆలోచిస్తుంటే ఇప్పుడు తెలుస్తున్నది - నీవెప్పుడూ ఒంటరిదానివేనని! నీవు ఒంటరిగా ఎలా ఉన్నావు, ఎందుకున్నావని నేను నిన్నెప్పుడూ అడగలేదు. ఆమాటకొస్తే 'అమ్మా, అన్నం తిన్నావా?' అనీ ఎప్పుడూ అడగలేదు! నీవే నన్నడిగావు ప్రతి పూటా - తిన్నావా? అని. తిను అన్నావు. పెట్టావు. అదే పద్ధతి అయిపోయింది. ఇందులో ఇచ్చిపుచ్చుకోవడాలూ, మేధాపరమైన న్యాయాన్యాయాలు లేవు. నీవు మహా సముద్రానివైతే, నీలోకి నిరంతరం ప్రవహించే నదులు నీ పిల్లలు. ఇదే

పద్ధతి. అందుకే నేనూ నా పిల్లల నిస్సహాయతను ప్రేమించాను. నీవు చేసినట్లే నేనూను! అప్పుడు 'అమ్మా! గారెలు, పాయసం చెయ్యి' అన్నాను. 'పప్పుచారు చేశావా! భలే భలే!' అన్నాను. 'పులిహోర చేశావా? నాకిష్టం' అన్నాను. ఇప్పుడు నా పిల్లలు నన్ను అడుగుతారు వేరే వంటలు. వాళ్లడిగేవీ, ఇష్టపడేవీ చేసిపెట్టడంలో ఎంత సంతోషమో! నీవూ నాకు చేసిపెట్టినప్పుడు ఎంత తృప్తిపడ్డావో నేను వాళ్లకు చేసినప్పుడూ అంత తృప్తీ కలుగుతుంది.

నీకు ఎడమ చెయ్యీ, కాలూ స్వాధీనం తప్పిపోయి స్పృహ తప్పిపోయి స్పృహ పోయిందనీ, ఆస్పత్రిలో చేర్పించాననీ చెల్లి సరూ ఫోన్ చేయగానే బయలుదేరాను. అది గొప్ప అయిదు నక్షత్రాల ఆస్పత్రి అని తెలిసింది గనుక కొంత నిశ్చింతలో ఉన్నాను. ఈ ప్రపంచంలో ఈ కాలంలో ఆధునిక మానవుడు అదుపులోకి తెచ్చుకున్న మహా శక్తివంతమైన వైద్యపరిజ్ఞానం అందించగల సపర్యలు యావత్తూ నీకు అందుతున్నట్లే. ఎక్కువ డబ్బులు చెల్లిస్తున్నామన్న ఆలోచన ఈ భావాన్ని కలిగించి ఉండవచ్చు. కానీ ఈ ఆస్పత్రి కూడా ఈ కాల పరిస్థితుల్లోంచి పుట్టుకొచ్చిన రూపమేననీ, మనుషులు అన్ని విలువలనూ పోగొట్టుకుని సంకుచితులైపోతున్నారనీ, ఈ కాలపు దుర్గుణాలన్నీ ఇక్కడ ఉంటాయనీ అనుకోలేదు. పవిత్రత, సేవాధర్మం లాంటి ఉన్నత మానవీయ గుణాల జోలికి పోకపోయినా వాళ్లు కోరిన డబ్బు ఇచ్చుకుంటున్నాం గనుక వైద్య వృత్తికి ప్రాథమిక ధర్మమైన శ్రద్ధ ఉంటుందన్న వెర్రి నమ్మకంతో పాటు ప్రాణదానం చేసే వైద్యవృత్తి పట్ల వైద్యో నారాయణో హరీ అనుకునే వెర్రిబాగుల గౌరవమూ ఉండి ఉండాలి మనసు లోపల - నిన్ను వాళ్లకి అప్పగించి బాధ్యత నిర్వర్తించి తృప్తిపడ్డాము.

నీకు సెరిబ్రల్ హెమరేజ్ అని చెప్పి ఐ.సి.యు.లో పెట్టారు. సాయంత్రానికి డ్రిప్ కారణంగా కుడిచెయ్యి వాచింది. బేండేజ్ వేసి సరిచేస్తామని చెప్పారు.

రెండో రోజు ఉదయం నేను మరిచిపోలేని రోజు. జనవరి సూర్యుడు తేజస్సుని నింపుకుని దర్శనమివ్వలేదు ఇంకా. ప్రపంచాన్ని సేదదీర్చి ప్రాణాల్ని కుదుటపరిచే చల్లని గాలుల్లోంచి నడుస్తున్నాను గనుక మనసులో నిండిన దిగులులోనే ఏదో చిన్న ఆశ! ఐ.సి.యు.లో మనుషుల మురికి అంటకుండా మెరిసే గచ్చూ, లోషన్ వాసనా, నిశ్శబ్దమూ, చిత్తరువులోని బొమ్మల్లాగ వారి వారి ఎన్‌క్లోజర్స్‌లో డాక్టర్లూ, నర్సులూ, చుట్టూ కమ్మీల మంచాల మీద అచేతనంగా పడుకుని వున్న అరడజను మంది రోగులూ - అంతా ఉండవలసినట్లుగా ఉంది. అన్ని పనులూ సవ్యంగా జరుపగల చోటు ఇదేనని నమ్మకం కలుగుతున్నది. పొద్దున్నే రౌండ్స్ చేసే స్పెషలిస్ట్ డాక్టర్ల సమూహాని కోసం ఐ.సి.యు. తయారవుతున్నది. పడకల మీది దుప్పట్లూ, గలేబులూ మార్చారు. రోగుల్ని

శుభ్రం చేసి తాజాగా గరగరలాడే ఆకుపచ్చని హాస్పిటల్ గౌన్లు వేశారు. నీవు తెల్లని దుప్పటి మీద బొమ్మలాగా పడుకుని ఉన్నావు. బాధతో మూలుగుతున్నావు. నీ కుడిచేతికి పొడుగ్గా లేత గులాబీరంగు బేండేజి ఉన్నది. దాన్లోంచి నీ వేళ్లు బయటకు చొచ్చుకొని ఉన్నాయి. అవి గులాబీ రంగులో లేవు. నల్లగా ఉన్నాయి.

వాటిని చూడగానే నా మనసులో ఏమేమి అనుమానాలు, ఏ భయాలు సుళ్లు తిరిగాయో నాకు తెలియదు. ఒక్క అంగలో మంచం దగ్గర ఉన్నాను నీ చెయ్యి పట్టుకుని. నా బుర్ర పనిచేయటం లేదు. నాకేమీ అర్థం కావటం లేదు. కాని జరగకూడని అనర్థం ఏదో జరిగిందన్న భయం భూతంలా ఆవహించింది. 'మా అమ్మ చెయ్యి ఇట్లా నల్లగా ఉన్నదెందుకు?' అన్నాను. నర్సు విమల లేచి వచ్చింది. 'అదా?... చూడండి, ఈ కట్టు బిగుతుగా లేదు' అన్నది బద్ధకంగా ఒళ్లు విరుచుకుంటూ, కట్టు లోపలికి తన వేళ్లు దూర్చి వదులును సూచిస్తూ. ఆమెకు అక్కడ అనర్థం ఏమీ కనిపించలేదు. ఆమె నల్లగా, పొట్టిగా ఉండి గంభీరంగా ఉంది. ఆమె సర్వజ్ఞురాలైనట్లు మాటల్లో ఏమాత్రం సందేహం కాని, తడబాటు కాని లేదు. చూపుతోనే ఎదుటి మనిషిని కట్టడి చేయగల ఆత్మవిశ్వాసం కనిపిస్తున్నది... అజ్ఞానులైన పల్లెజనాన్ని అదిలిస్తూ 'అనవసరంగా పిచ్చి ప్రశ్నలు వేయకు. నా సమయం వృథా చేయకు' అన్నట్లుంది ఆమె తీరు. 'చేయి ఇంత నల్లగా ఉన్నదెందుకు?' నా గొంతు అసంకల్పితంగానే పెద్దదయింది. నైట్ డ్యూటీ డాక్టరు సురేంద్ర, లేచి వచ్చాడు. వస్తూనే బేండేజి విప్పేశాడు. కుడిచెయ్యి మోచేతి వరకూ నల్లగానే ఉంది. 'డాక్టర్ మిత్రా వచ్చి చూస్తారు' అన్నాడు. మిత్రా అమ్మకి చూస్తున్న స్పెషలిస్టు. 'ప్రమాదమా?' అన్న ప్రశ్నకు సురేంద్ర సమాధానం ఇవ్వలేదు. నీవు చేయి ముట్టుకుంటేనే బాధతో మూలుగుతున్నావు.

స్పెషలిస్టు డాక్టర్లందరూ గుంపుగా ఐ.సి.యు.లోకి వచ్చేశారు. అప్పుడే డ్యూటీలోకి దిగుతున్నారేమో - నవ్వుకుంటూ, ఒకరినొకరు పలకరించుకుంటూ సరదాగా ఉన్నారు. ఏ పేషెంట్‌ను చూసినా వాళ్లకి ఒక్కొక్కరికి బిల్లులో వంద రూపాయలు జమ అవుతుంది.

నిన్ను డాక్టర్ మిత్రా పరీక్షించారు. రక్తనాళాల స్పెషలిస్టుకి చూపించారు. ఎముకల స్పెషలిస్టు రాజారావుగారికి చూపించారు. ఏవేవో పరీక్షలు చేయాలని కేస్ షీట్‌లో రాశారు. తర్వాత కాన్ఫరెన్స్ రూమ్‌లో వాళ్లు నిర్మోహమాటంగా ఈ విషయం చర్చించుకుంటారు. కాని నాతో చెప్పరు. నేను రావ్‌గారి వెనుకనే బయటికెళ్లాను. పరిస్థితి ఏమిటని అడిగాను. 'చేతికి బాండేజి వేయకుండా ఎత్తు దిండు మీద వాలుగా పెట్టి ఉంటే ఆ వాపు తగ్గిపోయి వుండేది' అన్నారు. ఎటో చూస్తూ, 'చెయ్యి తీసేయవలసిన పరిస్థితా?' నా భయాన్ని మాటల్లో పెట్టగలిగాను. 'అప్పుడే ఏమీ చెప్పలేము' అని వెళ్లిపోయారు.

ఆ చేతిని చేజేతులా అలా చేసుకున్నామా?! ఆశ్చర్యం, కోపం, అపనమ్మకం ముసురుకుని దిక్కు తోచనీయని స్థితిలో కారణాలు వెతుక్కుంటున్నాను. 'ఆమె రక్తనాళాల పరిస్థితి బాగాలేదు. అందుకే సెరెబ్రల్ హేమరేజ్ వచ్చింది. పెద్ద వయసు కదా. ఒకందుకు చేస్తే ఇంకోటి అవుతుంది' అన్నాడు డాక్టర్ సురేంద్ర. అప్పుడే డ్యూటీలోకి దిగిన డాక్టర్ శ్యామ్ 'ఏ రాత్రి వేళప్పుడో వాపు ఎక్కువైపోయుంటుంది. అప్పుడు బేండేజి బిగుసుకుపోయి ఉంటుంది' అసక్తితో నీ చేతిని చూస్తూ ఊహాగానం చేస్తుంటే మధ్యలోనే ఆపేశాడు సురేంద్ర. 'ఎందరికో ఇలా బేండేజీలు వేస్తూనే ఉంటాం. ఎవరికీ ఇలా కాలేదు' తిరుగులేని సత్యం చెబుతున్నట్లు ధీమాగా చెప్పింది నర్సు విమల. వాపు ఎక్కువైన సమయంలో బేండేజి బిగుసుకుంటున్నప్పుడు కొన్ని గంటలసేపు ఎవరూ ఈ విషయం గమనించలేదన్న అసలు విషయాన్ని వాళ్లు దాటేస్తున్నారు.

నీకు చేతి నొప్పి ఎక్కువగా ఉంది. ఎక్కువ మత్తునివ్వగల మందు నీ స్థితిలో ఇవ్వకూడదన్నారు డాక్టర్ మిత్రా. నీవు చాలా మూలుగుతున్నావు. నీకు నోట్లో పోయవలసిన మందులు నీచేత మింగించడం ఎవరివల్లా కావడంలేదు. ముఖం విసురుగా పక్కకి తిప్పేస్తున్నావు. మందు ఊసేస్తున్నావు. ఒక్కోసారి మందు గ్లాసునే ఎగరగొట్టేస్తున్నావు మొహం తిప్పేస్తూ. ఆ మందుని ఒక్క చుక్క నాలుక మీద వేసుకుని చూశాను. అంత చండాలపు చేదు ఎన్నడూ ఊహించగలది కూడా కాదు! ఇంటికెళ్ళడానికి బయలుదేరిన నర్స్ విమలను బతిమలాడి పిల్చుకొచ్చాను నీచేత మందు మింగించడానికి. ఆవిడ గొంతు నీ మేనకోడలి గొంతును పోలి ఉంది. అందుకే ఈ కోమా స్థితిలో నుంచి కూడా గుర్తించి నమ్ముతున్నావు. ఆవిడే నీ చేతిని పాడుచేసిందని నీకు తెలియదు.

నిన్నటి రోజున విమల తల్లి వాళ్ల పల్లెటూరి నుంచి వచ్చింది. విమలకు పెళ్లి కుదిరిందని సంతోషంగా ఉంది. ఐ.సి.యు.లో రాత్రి నర్స్ గంట గంటకూ స్పృహలేని రోగుల్ని పరీక్షించాలి. విమల ఆ పని చేయలేదు. చేసి వుంటే నీ చేతివేళ్లు నలుపు రంగుకు మారుతున్న విషయాన్ని గమనించి ఉండేది. ఈ ఘోరం తప్పిపోయి ఉండేది. అమెరికాలో డాక్టరుగా స్థిరపడాలని ఆశిస్తున్న డాక్టర్ సురేంద్ర రాత్రి చాలాసేపటి వరకు ఎఫ్.ఎం.జి.ఇ.ఎం.ఎస్ పరీక్ష కోసం చదువుకుని డాక్టర్స్ రూమ్‌లో కునుకు తీశాడు. తెల్లవారాక నేను వచ్చి చెప్పేవరకు నీ విషయం డాక్టర్‌గాని, నర్స్‌గాని గమనించనేలేదు. నీ కుడిచేతిలో కుళ్లు ప్రారంభమైంది. మనిషిలో పెరిగిన నిర్లక్ష్యానికీ, మనుషుల మధ్య సంబంధాలలో ఏర్పడిన సంకుచితత్వానికీ ఫలితం!

రోజులు గడుస్తుంటే బొగ్గు రంగుకు మారిపోతూ, చర్మం ఊడిపోతూ నెత్తురూ, నీరూ ఓడుతున్న నీ ముంజేతిని చూస్తూ కూడా ఎవరినీ ఏమీ అనలేకపోయాను. 'వీళ్ల

వైద్య వ్యాపారులు. వీళ్లని నిలదీసి నేను సాధించగలిగేదేమీ లేదు. వీళ్లని మంచి చేసుకుని ఆ చేతికి సరైన వైద్యం చేయించుకోవడం ముఖ్యం' అనుకున్నాను ఆడబుద్ధితో.

డాక్టర్ రావ్ వచ్చి నీ చేతిని పరీక్షించారు. దానికి కట్టు కట్టకూడదు, గాలి తగులుతూ ఉండాలి. చేతిని వాలుగా దిండు మీద ఉంచాలి. రోజూ రెండుసార్లు శుభ్రం చేసి మందు పూయాలి. కింది చెయ్యి వాపు కొంచెం తగ్గింది. అంతమేరకు నలుపు రంగు కూడా తగ్గుతున్నది. 'అది బాగుపడే అవకాశం ఉందా?' ఆశగా అడిగాను డాక్టర్ని. 'చూడాలి, ఎంతవరకూ పోతుందో చూడాలి' అన్నారు. ఏమిటీ పోవడం - చెయ్యా? క్రమంగా వేళ్ల చివర్లు కృశించి నల్లరాయిలాగా గట్టిపడుతున్నవి. 'ఆ వేళ్లను అయిదు నిముషాలకోసారి కదిలించాలి. లేకుంటే రక్తప్రసరణ లేక చచ్చుబడిపోతాయి. చేతులు, కాళ్లు కూడా కదిలించాలి' అన్నారు. 'ఎవరు చేస్తారు?' అని అడిగాను. కొంచెం ఆలోచించారు. అతనిలో ఎంతో కొంత మానవత్వం, తనూ మనిషినే అన్న జ్ఞానం మిగిలి ఉన్నట్లుంది. 'మీరే చేయండి' అన్నారు. ఈవిధంగా రోగులకు, వైద్య సిబ్బందికి తప్ప ప్రవేశం లేని ఐ.సి.యు.లోనే ప్రవేశించాను. నీ చుట్టూ తిరుగుతూ కుడిచేతి వేళ్లు ఒక్కొక్కటీ మెల్లగా పట్టుకుని కదిలించి, ఎడమ చేయి కదిలించి, ఎడమ కాలు పైకి, కిందికీ ముడిచి, తీసి. కుడికాలు కదిలించి - అయిదు నిముషాలైపోయింది. కుడిచేతి వేళ్లు కదిలించి, ఎడమ చేతి దగ్గరకెళ్లి - మిషనులాగా నీ చుట్టూ తిరుగుతూ రాత్రి పగలు పది రోజులు, నాకు తెలుసు. నీవే చెప్పావు. పని చేసుకుంటూ పోతే అదే అయిపోతుంది - నీవు ఆరోగ్యవంతురాలివై లేచి ఇంటికి రావచ్చు.

ఒక అర్ధరాత్రి ఇలా తిరుగుతూ ఉండగా దబ్‌మన్న శబ్దం వినిపించింది. నాలుగో మంచి మీద స్పృహలేని రోగి చుట్టూ వుండే కమ్మీలు జరిగిపోయి, ఆ ఎత్తు మీది నుంచీ కిందపడిపోయింది - మూటపడ్డట్లు. నర్సులు గబగబా వెళ్లి ఆ శరీరాన్ని మంచం మీదికి చేర్చి కమ్మీలు సర్దేశారు. రెండు గంటల క్రితం ఆ శరీరం తాలూకు భర్తా, చెల్లెలూ రోగి ప్రక్కనే వుంటామని కాళ్లా వేళ్లా పడ్డారు. ఇక్కడి క్రిమిరహిత వాతావరణంలోకి ఏ విధమైన అంటూ ప్రవేశించరాదు కనుక వాళ్లను నిర్దాక్షిణ్యంగా బయటకు గెంటేశారు.

వాళ్లు బయట వరండాలో నేల మీద దుప్పటీ పరచుకుని కూర్చుని జాగారం చేస్తున్నారు.

ఏడో నెంబర్ మంచంలోని ఎలక్ట్రికల్ ఇంజనీర్ చిరంజీవి, భార్య చిట్టెమ్మతో తన బాధ చెప్పుకోవాలని "చిట్టీ! ఒక్కసారి రా! ఈ నొప్పి తట్టుకోలేనే!" అంటూ పెద్దగా కేకలేస్తూ ముక్కులో నుంచి కడుపులోకి పెట్టిన గొట్టాన్ని పీకేయడానికి ప్రయత్నిస్తున్నాడు. తెల్లవారుజామున ఎప్పుడో అతని ప్రాణం పోయేవరకూ వార్డు నిండా పెడబొబ్బలే!

బయట జాగారం చేస్తున్నవాళ్లకు ఇవేవీ వినిపించవు. ఇక్కణ్ణుంచి ఏ శబ్దమూ బయటికెళ్లదు.

ఇరవైఏళ్ల క్రింద నాన్న చనిపోవటం గుర్తుకొచ్చింది. చిన్న ఇంట్లో ముందు గదిలో పరుపు మీద పడుకున్నాడు కళ్లు మూసుకుని... గురక వచ్చింది. అత్తయ్య ప్రక్కన కూర్చుని అప్పుడప్పుడు పలకరిస్తూ, స్పూనుతో నోట్లో పాలు పోస్తూ, కాళ్లు రాస్తూ కూర్చుంది. మధ్య మధ్యలో ఏవో అందిస్తూ, పలకరిస్తూ... అందరం దిగులుగా ఆ చుట్టూ తిరుగుతున్నాము. ఇరుగూ పొరుగూ, బంధువులూ అటూ ఇటూ తిరుగుతూ చిన్నగా మాట్లాడుకుంటున్నారు. పట్టణంలో వుండే మంచి వైద్యసహాయం, మంచి ఆస్పత్రి వుంటే బాగుండేదన్న భావన అందర్లోనూ ఉంది. గబుక్కున నాన్న కళ్లు తెరుచుకున్నవి. శ్వాస నిలిచిపోయింది. రోదనలూ, హడావుడీ... కావలసినవాళ్లందరి మధ్య నుంచే ఆ ప్రాణం వెళ్లిపోయింది. ఒంటరిగానే... కాని చావులోని ఆ ఒంటరితనం వెళ్లిపోయిన ప్రాణిదేగాని ప్రపంచానిది కాదు!

డాక్టర్ సురేంద్ర వచ్చాడు. నీ స్పృహ ఎంతట్లో ఉందో పరీక్షించడానికేమో, కేస్ షీట్ మీది నీ పేరు చూసి 'శాంతమ్మా... శాంతమ్మా' అని పిలిచాడు పెద్దగా. నిన్ను ఆ పేరుతో ఎవరూ పిలవరు గనుక నాకే క్రొత్తగా వినిపించింది. 'అలా పిలిస్తే తననేనని అమ్మకి తెలియదు. అందరూ అమ్మా అనే అంటారు' అన్నాను. నిన్ను రోగిగా కాకుండా వ్యక్తిగా గుర్తించటానికి అతనికి కొంత సమయం పట్టింది. అదోలాగా నన్ను చూసి 'అమ్మా' అని పెద్దగా పిలిచి చూశాడు. నీలో చలనం లేదు. వెళ్లిపోయాడు. 'పేషెంట్స్ fussyగా ఉంటే ఎట్లా?' అనుకుని ఉంటాడు.

మూడు గంటలకోసారి నీ రక్తనాళాల్లో సూది గుచ్చి రక్తం తీస్తున్నారు పరీక్ష కోసం. ఏ ఒక్కసారీ ఏ నర్సుకీ ఒక పట్టాన నరం దొరకదు. ఆ సూదిని రకరకాలుగా ముంజేతి నరాన, పై చేతి నరాన గుచ్చి, కుదరక కడుపులోకి గుచ్చి, ఇది కాదని మరొకర్ని పిలిచి, చివరికి డాక్టర్ని పిలిచి - ప్రతివాళ్లూ తిరిగి అన్నిచోట్లా గుచ్చుతూ చివరికి టెక్నీషియన్ వచ్చి చేతి నరం నుంచీ సులువుగా రక్తం తీసిచ్చి వెళ్తే-స్పృహ లేకుండా ఉన్న నీవు నొప్పితో మూలుగుతుంటే-తిరిగి రక్తం శాంపిల్ కావల్సిన సమయానికి డ్యూటీ నర్సు సూదితో హాజరు! టెక్నీషియన్స్‌ని చాల అవసరమైతే తప్ప పిలవరు. పెద్ద వయసు... రక్తనాళాలు బాగాలేవు! అంటారు. బాగా లేనప్పుడు టెక్నీషియన్ వస్తే నీకు చాల బాధ తప్పుతుంది గదా అని నా ఆదుర్దా.

ఒకసారి కాలి రక్తనాళం కత్తిరించి అందులోకి డ్రిప్ ఏర్పాటు చేస్తున్నారు. అది చాల బాధ కలిగిస్తుంది. 'మీరు కొంచెం సేపు బయట కెళ్లండి' అన్నారు నాతో. వెళ్లాను

'అక్కడే వుండి అమ్మ చెయ్యి పట్టుకునుంటే కొంచెం ఓదార్పుగా ఉంటుందేమో' అనుకుని మనసు గట్టి చేసుకుని లోపలికెళ్లాను. స్పృహ లేని స్థితిలో కూడా స్పర్శ తెలుసుకుని నిమ్మళిస్తున్నావు. నొప్పికి ఏడుస్తూ ఉన్నదానివి గబాల్న ఆగావు. ఒకట్లు లెక్కపెట్టడం ప్రారంభించావు. ఒకటి... రెండు... మూడు... తొంభై వరకు చెప్పి ఆగావు. తిరిగి తొంభై ఒకటి అంటూ మొదలెట్టి సాగావు చెప్తూ - ఆగుతూ. మూడు వందల వరకూ ఒక్క పొరపాటు కూడా లేకుండా వాళ్ల పనులయ్యే వరకూ చెప్పావు. ఈ ప్రపంచంలో వున్న నిర్దయనూ, బాధనూ ఎదుర్కోలేక ఆ అంకెల్లో వున్న ఏ క్రమతలోనో దాక్కోవాలన్నట్లు చెప్పుకుపోయావు.. నీ జ్ఞాపకశక్తి బాగున్నది. నీ మెదడుకేమీ కాలేదు. మళ్లీ లేస్తావని ఏ స్పెషలిస్ట్ దేవుడన్నా చెప్తాడని ఆశ - నల్లగా రాతిబొమ్మ అయిపోతున్న నీ చేతిని చూసి నిరాశ.

రోజూ మధ్యాహ్నం మూడు గంటలసేపు చెల్లి సరూ నీ దగ్గరుండేది. నేను ఇంటికెళ్ళి స్నానం, భోజనం, నిద్ర కానిచ్చుకుని మంచినీళ్ల సీసాలు పట్టుకుని నీ దగ్గరకు వచ్చేదాన్ని. ఆ రోజున అలానే వెళ్లాను. తిరిగి వచ్చేసరికి ఏమిటో ప్రయత్నాలు జరుగుతున్నవి నీ దగ్గర. ఈ రోజు నీ రక్తంలో తెల్లకణాలు తేడా వచ్చిందట. కాన్సర్ స్పెషలిస్ట్ వచ్చి చూసి ఏదో పరీక్ష రాశాడట. ఇప్పుడు నీ వెన్నెముకలో నుంచీ మూలుగ తీసి పరీక్షకి పంపాలిట. అదే ప్రయత్నం. నీవు చెయ్యి నొప్పితో ఎన్నో బాధల్తో ఏడ్చి మూలిగి అలసిపడిపోయి ఉన్నావు. ఇన్ని రోజులు - ఇంత బాధ - ఎందుకోసం? నేను ఏమి చెయ్యాలో నాకు స్పష్టమైంది. ఈ పరీక్ష జరక్కూడదు! ఇక్కడ గొప్ప విజ్ఞానం ఉన్నది, మనిషి లేడు. సుఖ దుఃఖాలనుభవించే జీవిని గుర్తించే వాళ్లు లేరు! మేధ ఉన్నది. హృదయం లేదు. నీవు ఈ ప్రయోగాలలో వస్తువు కాదు. నీ మంచి చెడ్డలు నీవి. నీవు లోకరీతిలో కొట్టుకుపోతున్న పిచ్చి కాగితానివి కాదు. విజ్ఞానమనే బృహత్ యంత్రంలో అనామకమైన కీలువి కాదు. నీవొక ప్రత్యేకమైన జీవివి. నీతో నిమిత్తం లేకుండా నిర్ణయాలు జరిగిపోకూడదు!

అంకాలజిస్ట్ వచ్చారు. మంచి నిపుణుడైన వైద్యుడుగా పేరు పొందిన వ్యక్తి. మాట స్పష్టంగా, చూపు నిశితంగా, చేష్ట అసందిగ్ధంగా ఉంది. మర్యాదగా అమాయకురాలిలా అడిగాను, 'చాల నొప్పి పుడుతుందాండి?' అని. చాల నొప్పి పుడుతుందనీ, పరీక్షలో ప్రాణం పోయిన సందర్భాలున్నాయనీ అంతకుముందే వాకబు చేసి కనుక్కున్నాను. అతను నిర్లక్ష్యంగా చూసి 'అవును' అన్నారు. ఈ పరీక్ష ప్రయోజనం ఏమిటని అడిగాను. 'రక్తంలో మార్పుకి కాన్సర్ కారణమైతే వెంటనే చికిత్స చేయడానికీ రక్తం ఎక్కించడానికీ పనికొస్తుంది'. కాన్సర్ ఉంటే!

"ఈ స్థితిలో ఇలా వెన్నుపూస నుంచీ మూలుగ తీస్తే అసలే స్పృహలో లేని డెబ్భై యేళ్లపైబడ్డ ఈమె తట్టుకోగలదను కుంటున్నారా?" డాక్టర్ కోపంగా చూస్తున్నారు ఏదో అనబోతూ. కాని నేను చెప్పదలచు కున్నది చెప్పి తీరాలి.

"ఈమెకు కాన్సర్ కూడా ఉందని తెలిస్తే ఏమి చెయ్యగలరు? నయం చెయ్యగలనని మీకు నమ్మకం ఉందా?" అడిగాను.

అతను కొంచెం ఆలోచనలో పడ్డాడు.

"మీరు పెట్టబోయే బాధకు ఫలితంగా అమ్మ లేచి, అయిదు నిముషాలు - కేవలం అయిదు నిముషాలు చాలు - ప్రపంచాన్ని చల్లగా చూసే అవకాశం ఉందని చెప్పగలిగితే - నిరభ్యంతరంగా చెయ్యండి. ఆమె పరిస్థితిని బాగా గమనించండి. ఆ చేతిని చూడండి. ఆ అవకాశం ఉందా?" అన్నాను నిర్వికారంగా.

ఆయన ఒక్క నిముషం ఆలోచించారు. 'గట్టి ప్రయత్నం వద్దంటారా?' అన్నారు.

ఏమీ చెప్పలేకుండా, నిస్సహాయంగా బాధతో విలవిల్లాడిపోయే నీ రూపం కళ్లల్లో మెదిలింది.

"ఈ పరిస్థితిలో ప్రయోజనం లేని నరక బాధ అనవసరమనుకుంటాను" అన్నాను.

"మీ ఇష్టం" అనేసి వెళ్లిపోయారు.

నేను రావటం కొంచెం ఆలస్యం అయ్యుంటే?! నా అజలేని క్షణంలో వీళ్లు నిన్ను ఏమో చేస్తారన్న వింత భయం పట్టుకుంది.

నిన్ను చాలా బాధపెట్టి రోజూ చాలాసార్లు పరీక్షకంటూ రక్తం తియ్యడాన్ని రెండు సార్లకు పరిమితం చేయించాను మిత్రాగారి నడిగి. డ్యూటీ డాక్టరు 'డ్రిప్'లో కలపాల్సిన పొటాషియంలాంటి మినరల్స్‌ని ఎంత కావాలో పరీక్ష లేకుండా ఎలా తెలుస్తుంది? అన్నది ప్రశ్న. ఈ పరీక్షలు విరివిగా లేకుండా ఇదివరలో వైద్యం ఎలా చేశారు? ఇంతమంది స్పెషలిస్ట్‌లు లేకుండా ఒకే డాక్టరు ఎలా బాధ్యత తీసుకునేవారు? డాక్టరుకు కేవలం పరీక్షలే కాకుండా విచక్షణా శక్తి కూడా ఉంటుంది కదా! అని నాకు నేను సర్దిచెప్పుకున్నాను. అప్పటి నుండి నీకు కొంత ప్రశాంతి చిక్కింది.

ఒకరోజున డాక్టర్ వచ్చినప్పుడు స్పృహ సరిగా లేకపోయినా ఏమిటో చెప్ప ప్రయత్నించావు. ఏమిటోనని అందరం శ్రద్ధగా చూశాము. కష్టపడి చెయ్యి పైకెత్తి మూడు వేళ్లు చూపించావు. అక్షరం అక్షరం కూడబలుకుతూ 'ముగ్గురున్నారు' అన్నావు. 'మూడు చోట్ల ఉన్నారు.... అంతటా ఉన్నారు... సందడిగా ఉంది..." అన్నావు తృప్తిగా. శక్తినంతా కూడదీసుకుంటూ 'పెద్దమ్మాయి... సరూ... చిన్నారి' అన్నావు. అవి మా పేర్లు. నీ పిల్లల పేర్లు. 'తలుపులు బాగా వేసుకోండి. జాగ్రత్త' అన్నావు. నీవు చూస్తున్నది ఈ ప్రపంచపు

వాస్తవం కాదు. అది నీ లోకం. నీ లోకం నిండా నీ పిల్లలే ఉన్నారు. అపస్మారక స్థితిలోని నీ కలవరింతలకు దిగులు కలిగింది. జీవితమంతా ఒక తపస్సుగా కాగి, కాలి ఆఖరికి నీ మనస్సు పొందిన రూపం ఇదా? మొత్తం ఇంతేనా? నీవు మా మంచి కోరి మా గురించి ఆలోచించే దేవతవు! ఈ కుటుంబానికి ఆశీస్సువి!

నీ గుండె పరిస్థితిలో అవకతవకలు లేవని ఆసిలేటర్ చెబుతున్నది. ఇహ ఐ.సి.యు.లో వుండి ప్రత్యేక ప్రయోజనం లేదు. నీ ట్యూబులన్నిటితో సహా నిన్ను ప్రైవేట్ రూంకి మార్చారు.

ఇక్కడ తెల్లవారకుండానే తడిగుడ్డతో నీ ఒళ్లు తుడిచి, పౌడర్ వేసి బట్టలు, షీట్లు మారుస్తుంది ట్రైనీ నర్సు నళిని. 'మేము శుభ్రం చేస్తున్నప్పుడు మీరు బయట ఉండాలి. రూల్స్' అన్నది. నేనూ సహాయం చేస్తానన్నా వినలేదు. నన్ను వెళ్ళనిచ్చి ముఖం, చేతులు మాత్రం తుడిచి బట్టలు మార్పేసింది అయిదు నిముషాల్లో. రెండ్రోజుల్లో వీపు వెనక ఎర్రగా కమిలిన మచ్చలు ఏర్పడ్డవి. ఇకమీదట బెడ్ సోర్స్ అవుతవట. అవీ ప్రమాదమేనట. శుభ్రత తక్కువైతే యూరినరీ ఇన్ఫెక్షన్ వస్తుందట. అసలు జబ్బు తగ్గినా దాని వలన ప్రాణాలు పోయిన సందర్భాలున్నాయట. నర్స్ నళినికి ఈ పనులంటే అసహ్యం!

ప్రైవేట్ రూమ్స్‌లో వున్న రోగులకు డాక్టర్ కేస్ షీట్స్‌తో రాసి వెళ్లిన మందులు నర్స్ వచ్చి ఇస్తుంది. వాటిని పౌడర్ చేసి నీచేత తాగించాల్సిన బాధ్యత నాదే.

డాక్టర్ రాసిన అరు మందులూ చూసి గుర్తుంచుకుని ఉన్నాను. నర్స్ వచ్చాక నా చేతికిచ్చిన మందులు పరిశీలిస్తే కొన్ని డబుల్ డోసుల్లో ఉన్నవి. నర్స్ కోసం బెల్ నొక్కాను. ఎవరూ రాలేదు. కొన్నిసార్లు ప్రయత్నించాను. ప్రతి రూం నుంచీ ఆదుర్దాతో అలమటించే వాళ్ల పిలుపులన్నిటికీ వాళ్లు రాలేరు కదా అనుకుని స్టాఫ్‌రూం దగ్గరికెళ్లాను.

నలుగురు నర్సులు నవ్వుకుంటూ నిమ్మాదిగా జోకులేసుకుంటూ డ్యూటీలు మారే హడావుడిలో ఉన్నారు. మందులిచ్చినావిడ కూడా ఉంది. అందర్లోకి వయస్సులోను, శరీర పరిమాణంలోనూ, సీనియారిటీలోనూ ఎక్కువగా వుండి పెత్తందారీగా కనిపిస్తున్నది. నేను చెప్పిందంతా విని లేచి ఫైల్ చూసింది.

"మందులు వేరే బ్రాండ్స్ వచ్చి పొరపాటైంది" అన్నది నిర్లక్ష్యంగా.

నీ శరీర ధర్మాలను నియంత్రించే మందులు అవి! ఈ అధునాతన విజ్ఞాన నికేతనంలో పనులన్నీ శాస్త్రీయంగా, పొరపాటు లేకుండా జరగాల్సిన చోట ఎన్ని పొరపాట్లు! ఎంత అశ్రద్ధ! దేవుడో, విధో, జబ్బో, బలహీనతో - ఆ కనబడని కర్మ చెయిదాల ముందు మనిషి నిస్సహాయుడే! కాని మనుషులు-నమ్మిన మనుషులు-సహాయం చెయ్యగల

పరిస్థితిలో ఉన్నవాళ్లు-నమ్మించి ప్రతిఫలం ఇబ్బడి ముబ్బడిగా తీసుకుంటున్నవాళ్లు-కేవలం అశ్రద్ధతో ముప్పు తీసుకుని వస్తే ఎలా అర్థం చేసుకోవాలి? ఎలా క్షమించాలి? ఈ వైద్య విజ్ఞానం-ఈ పవిత్రమైన విధి-వాళ్ల చేతుల్లోకి వారసత్వంగా వచ్చిందన్న జ్ఞానం లేకుండా స్వార్థంతో ప్రవర్తించడం ఎంత నేరం! ఎందరో పేషెంట్ల ఒత్తిడితో, ఊపిరాడనివ్వని పనులలో నుంచీ రోగికి సానుభూతి చూపించడానికి, ఆర్ద్రత ఏర్పడటానికి వాళ్లకు సమయం ఉండకపోవచ్చు. కాని వృత్తి ధర్మం, శ్రద్ధ, నిజాయితీ లోపిస్తే ఎలాగ? మానవ సమాజం నిర్విరామ కృషితో సాధిస్తున్న ఈ అపార జ్ఞాననిధిని ఎంత నిర్లక్ష్యంతో నిర్వీర్యం చేసుకుంటున్నాము!

ఈ అల్లోపతి వైద్యం వలన ఈమె స్థితిలో మార్పు రావటం లేదు. హోమియో డాక్టర్ దయాకరంగారు విషయం పూర్తిగా విని, ఈమెకు చెయ్యి నయమై తెలివిలోకి రావడం జరుగుతుందని నమ్మకంగా చెప్పారుగనుక మూడు గంటలకోసారి ఒక్కో పొట్లం చొప్పున ఈ మాత్రలు నోట్లో వెయ్యమంటూ నంబరువారీగా గుర్తించిన చిన్న పొట్లాలు ఇచ్చారు మరిదిగారు. పదిహేనురోజుల నుంచీ సూదులద్వారా ఎక్కిస్తున్న ద్రవాలు, పరీక్షలకని బాధించి తీస్తున్న రక్తం శాంపిల్సు, రకరకాల చేదుమందులు చూసిన తర్వాత ఈ పొట్లాల్లోని చిన్ని చిన్ని తియ్యని మాత్రలు ఎంతో ఆత్మీయంగా, ప్రియంగా కన్పించి సంతోషం కలిగింది. ప్రపంచంలోని అన్ని దేశాల్లోనూ అల్లోపతి పరిమితులను గుర్తించి, దేశీయ వైద్య విధానాలపై, హోమియో, ఆయుర్వేద విధానాలపై చూపు సారిస్తున్నారు.

మాకు ఇంతకంటే జరగగల అనర్థం ఏముంటుందని అనుకొని పొట్లాలు తీసుకున్నాను, ఎటునుంచీ ఆశాలేశం కనిపించని స్థితిలో. ఇప్పుడు రెండు విధానాల మందులూ పోతున్నవి నీ శరీరంలోకి.

నీ వీపు వెనక ఏర్పడిన ఒరిపిడి మచ్చ పుండుగా మారుతున్నది. రెండు గంటల కొకసారి నిన్ను మరో ప్రక్కకు ఒరగిల త్రిప్పి దిండ్లు సర్ది పడుకోబెట్టాలి. డాక్టర్ మిత్రా ఈ విషయం స్పష్టంగా నర్సుతో చెప్పారు. ఇది ఒక్కరి వల్ల అయ్యే పని కాదు. ప్రతిసారి నర్స్ కోసం గంటసేపు ప్రయత్నం చేయాలి.

ఒక ఉదయాన మలయాళీ ట్రైనీ నర్స్ ఆషా వచ్చింది పిలవకుండానే.

"మేము కొత్తగా వచ్చాము. ఊరికే వార్డ్సు చూస్తున్నాము. డ్యూటీ కాదు" అన్నది నవ్వుతూ. నీ చెయ్యి చూసి బాధపడుతూ "అయ్యో కాలిపోయిందా?" అన్నది. ఇది హాస్పిటల్ వారి నిర్వాకమేనని చెప్తే విచారించింది. నిన్ను ప్రక్కకుతిప్పి దిండ్లు సర్దటానికి సాయం చేసింది.

ఆ పద్దెనిమిదేళ్ల అందమైన లేతముఖంలో ఆర్ద్రత, చేతల్లో శ్రద్ధ తొణికిస

లాడుతున్నది. ఎడారిలో ఒయాసిస్ కన్పించడం అంటారు, ఇలానే ఉంటుందేమో అన్పించింది.

"నాకు స్కూల్లో మంచి రేంక్ వచ్చేది. కాని నేను డిగ్రీ కోర్సు చేసినా ఉద్యోగం రాదు. అందువలన మా నాన్న, అన్నలు పదివేలు డొనేషన్ కట్టి ఈ నర్సింగ్ స్కూల్లో చేర్పించారు. స్కూలు వాళ్లు మమ్మల్ని ట్రైనింగ్ కోసం ఈ హాస్పిటల్‌కు పంపుతున్నారు. ఇక్కడ పని చేసినందుకు భోజనం ఉచితం. ట్రైనీలందరం ఇలా వచ్చినవాళ్లమే" అన్నది.

"నళిని మా సీనియర్. పని సరిగా చెయ్యాదని సూపరింటెండెంట్ చాలాసార్లు తిట్టారట" అన్నది నవ్వుకుంటూ.

ఇక్కడ వేరే లోకం, వేరే సంబంధాలు ఉన్నట్లున్నది!

"నేను వీలున్నప్పుడు మళ్లీ వస్తాను, సహాయం చెయ్యటానికి" అన్నది. ఆ అమ్మాయి రాకతో అమానుషత్వంతో పిచ్చెక్కిస్తున్న హాస్పిటల్ వాతావరణంలోకి పరిచిత లోకం తొంగిచూసినట్లు, పచ్చని ఆశ మొలకెత్తినట్లు ధైర్యం కలిగింది.

ఆగదిలోనే ఇంతవరకు ఖాళీగా ఉన్న రెండో బెడ్‌లోకి పదేళ్ల పాప రూపాలి వచ్చింది. కాంతి కిరణం చిందులేస్తున్నట్లుగా ఎగురులాంటి నడకతో వచ్చింది. బొద్దుగా, తెల్లగా, చురుగ్గా ఉంది. ఒత్తయిన జుట్టుని రెండు జడలుగా వేయించుకుని, డ్రెస్‌కు మాచ్ అయ్యే క్లిప్పులు పెట్టుకుంది. తన మేకప్ గురించి చాల సంతృప్తితో, సంతోషంగా ఉంది. హడావుడిగా తన బాగ్‌లో వెతికి పుస్తకం బయటకు తీసి ఉత్సాహంగా తన అన్నకు చూపించింది.

గదిలోకి రెండు పిచ్చికలు వచ్చినట్లు సంరంభం మొదలైంది. రూపాలికి రెండు కిడ్నీలు చెడిపోయాయి. వాళ్ల ప్రాంతంలో ఉన్న ఢిల్లీ, చండీగఢ్ పెద్ద ఆసుపత్రులలో దగ్గరి బంధువులవైతే తప్ప కిడ్నీ మార్పిడీలు చెయ్యరట. కుటుంబ సభ్యులవి పనికి రాలేదు. అందువలన చాలా వాకబులు చేసుకుని ఇక్కడకు వచ్చారు.

"ఇక్కడ డాక్టర్ అగర్వాల్ చేస్తున్న కిడ్నీ మార్పిడులు నూటికి తొంభై వంతులు విజయవంతమయ్యాయని విన్నాము." ఇదంతా నమ్మకంతో చెప్తున్నా రూపాలి తల్లి అరుణ్ భటేజా ముఖంలో దిగులు, సందేహం మొయ్యరాని బరువులు కనిపిస్తున్నవి.

రోగి వెంట వచ్చిన వారు రూంలో ఒక్కరే ఉండాలి. భటేజా, కొడుకూ హోటల్‌కి వెళ్లిపోయారు. వాళ్లు వెళ్లిన కొంచెం సేపటికి రూపాలికి ఒళ్లంతా నొప్పులు ప్రారంభమయ్యాయి. భయపడిపోయి వాళ్లమ్మతో ఏమో చెప్పుకుంటూ మూలగటం ప్రారంభించింది.

అరుణ్ భటేజా మరింత గాభరాపడుతూ కూతుర్ని మంచం మీద పడుకోబెట్టి

వీపు, భుజాలు నొక్కుతూ, ఓదార్చుతూ గబగబా నర్సుల్ని కేకేసింది. హడావుడిగా సంప్రదింపులు జరిగి ఎక్కడి వస్తువులక్కడ పడేసి రూపాలిని వీల్‌ఛైర్‌లో డయాలిసిస్‌కు తీసుకెళ్లారు.

తెల్లవారేసరికి డయాలిసిస్ పూర్తయి రూపాలి తిరిగి తన మంచం మీదకు చేరింది. వాడిపోయిన తోటకూర కాడలా జడలు నలిగిపోయి జుట్టు రేగి చిందరవందరగా ఉంది.

'ఎందుకు? నా బంగారు తల్లికి ఇంత బాధ ఎందుకు? నా రూపాలికే ఇట్లా జరిగిందెందుకు?' పిచ్చిగా తనలో తనే మాట్లాడుకుంటున్నది అరుణ్.

ఈ ఏడాదిన్నరలో, జబ్బు విషయం తెలిశాక అల్లోపతీ ఒకటే కాక హోమియో, నాటు మందులూ, ఆయుర్వేదం - అన్ని పద్ధతులూ ప్రయత్నించారట. అన్ని ఆశలూ వట్టిపోయాక ఇక్కడికొచ్చారు. డబ్బు గురించి వాళ్లు ఆలోచించటం లేదు. చేతికందిందంతా తెచ్చి గుమ్మరిస్తున్నారు.

ఈ ఆసుపత్రిలో చాలా అశ్రద్ధ, నిర్లక్ష్యం ఉన్నాయనీ, ప్రతి విషయంలోనూ జాగ్రత్తగా చెక్ చేసుకుంటూ ఉండాల్సిన పరిస్థితి అని హెచ్చరించాలనుకున్నాను గాని ఆ జాగ్రత్తలన్నీ ఇప్పుడు ఎందుకో అసందర్భంగా, కుళ్లు మాటల్లాగా, అప్రస్తుతంగా తోచాయి.

వాళ్లకి మిగిలింది ఆశ మాత్రమే. ఈ ప్రపంచంలో మనిషి ఊహకు మించినవీ, ఊహల్ని తారుమారు చేసేవీ ఎన్నో విషయాలు జరుగుతూనే ఉంటవి అన్న ఆశ లోపిస్తే జీవితం మొయ్యలేని బరువుగా మారుతుంది.

రూపాలిని చూశాక నా ఆలోచనల్లో చాలా మార్పు వచ్చింది, మనసు విరిగిపోయింది. లోపల గూడుకుని వున్న దుఃఖం కరిగి ప్రవహించింది. జరా, రుజా మృత్యువులు మనిషికి తోబుట్టువులు. తప్పించుకోలేని సహచరులు. ఇది నిజం.... నిజం... నిజం...

"నీవు వార్డుల్లో తిరుగుతూ వందలమంది పేషెంట్స్‌ని చూస్తున్నావు ఇటువంటి చేతిని చూశావా?" ఆషాని అడిగాను.

"ఓ చూశాను. బర్న్స్ యూనిట్‌లో భాను అని నాలుగో క్లాసు చదివే అబ్బాయి. ముద్దొచ్చేలా వున్నాడు. చదువులో కూడా క్లాసులో ఫస్ట్ వస్తాడట. వారం రోజుల క్రిందట పరీక్షల కోసం కిరోసిన్ దీపం దగ్గర చదువుకొని పడుకుంటే ఏక్సిడెంట్ అయింది. అరవై శాతం కాలిపోయాడు. వాళ్ల నాన్నకి చిన్న ఇల్లుంటే తాకట్టు పెట్టి ఏడు వేలు తెచ్చి ఇక్కడ చేర్చారు. నేను వెళ్తే 'ఈ నెప్పి భరించలేను. నన్ను చంపెయ్యక్కా' అని అడిగాడు. వాళ్ల డబ్బు అయిపోయిందట. హాస్పిటల్ వాళ్లు తీసుకెళ్లి పొమ్మన్నారు. ఇవాళ వెళ్లిపోయి ఉంటారు" అన్నది బుర్ర వూపుతూ, కళ్లు తిప్పుతూ.

"నాకివాళ పనుంది... అమ్మ జుట్టు మెత్తగా పట్టులాగా ఉంది" అని నీ తెల్లటి జుట్టుని సర్ది హడావుడిగా వెళ్ళిపోయింది.

నాకు మెదడు మొద్దుబారి పోయింది. ముచ్చటగా ఉండే పదేళ్ల పిల్లవాడిని 'నీవు కాలిపోయావు, నీకు డబ్బు లేదు, ఎక్కడన్నా చావు పో' అంటున్న నిజం ఊహించుకోవడానికి చేతకాలేదు.

ప్రజాస్వామ్య భారతదేశమూ, ఆధ్యాత్మిక సంస్కృతీ, పవిత్రమైన వైద్యవృత్తీ, మానవహక్కులూ - అన్నిటినీ ఊహించుకోగలను. కాని ఆ చిన్న భాను పరిస్థితిని ఊహించుకోలేకుండా ఉన్నాను... ఎక్కడో పొరపాటు ఉన్నది.

ఒక మనిషి కోసం ఆలోచించే ఇంకో మనిషి లేడా...?

ఈ నచికేతుణ్ణి ఏ యమధర్మరాజు గుర్తించాలి?....

లోకరీతిలో నుంచి అమ్మదనం వెళ్ళిపోయిందా...?

ఇక్కడొక మానవ సమాజం ఉన్నదా, లేదా?... ఒకదాన్తో ఒకటి సంబంధం లేకుండా చేతగాని పిచ్చి ఆలోచనలు...

ఆ రోజు మధ్యాహ్నం నేను, సరూ, పిల్లలూ, అల్లుళ్లూ అందరం నీ మంచం చుట్టూ నిలబడి ఉన్నాము. నీవు కళ్లు తెరిచావు. వరుసగా అందరినీ చూశావు. ప్రతి మనిషినీ గుర్తించినట్లు నీ చూపులో తెలుస్తున్నది. అల్లుళ్ల ఎదుట కన్నీంచటం నీ పద్ధతి కాదు. అందువలన కళ్లు ప్రక్కకు తిప్పుకుని 'ఎందుకు మీరందరూ వచ్చారు?' అన్నావు. ఇరవై రోజుల తర్వాత తెలివితో మాట్లాడిన మాట! గొంతు కొంచెం బొంగురుగా ఉంది. మాకు చాల సంతోషం కలిగింది. సరూ నీకు మరింతగా ధైర్యం కల్గించాలనుకుంది.

"చిన్నారి కూడా అమెరికా నుంచి వస్తున్నది" అన్నది పెద్దగా.

నీవు చెయ్యి పైకెత్తి 'రాదు' అన్నట్లు అడ్డంగా ఊపావు. 'పాయసం కావాలి, ఆకలి' అన్నావు.

శబ్దం స్పష్టంగా లేదుగానీ మాటలు అర్థం అవుతూనే ఉన్నవి. వెంటనే ఇంటికెళ్లి పాయసం, అరటిపండ్లూ తెచ్చాము. అవి రెండూ నీకు ఇష్టమైన పదార్థాలు. వాటిని ఆప్యాయంగా తిని మగతలోకి జారిపోయావు.

ఈ విషయం ఫోనులో విని చిన్నారి చాలా ఏడ్చింది. రెండు నెలల క్రిందట నిన్ను చూడటానికి ఇక్కడికి వచ్చినపుడు 'ఇక నేను నిన్ను చూడను' అని చెప్పావట. మనిషి తన జీవన నాటకాన్ని తాను చూసుకోవటం, ఇంత సాదాగా వీడ్కోలు చెప్పడం - సాధ్యమా?

నీ చేతివ్రేళ్లు రెండో కణుపు వరకు నల్లగా బొగ్గు రంగుకు మారిపోయి

గట్టిపడిపోయాయి. ముంజేయికి చర్మం ఏర్పడకపోయినా నీరూ, రక్తము కారడం తగ్గింది. హాస్పిటల్‌లో చేరి నెల రోజులయింది. నీకు తెలివి రాలేదు. కాని కొంచెంగా పాయసం, అరటిపండు, ఇడ్లీ తింటున్నావు. హాస్పిటల్ నుంచి డిశ్చార్జి చేయించుకుని ఇంటికెళ్లాము. నీకు తగిలించిన ట్యూబులన్నీ తీసేశారు. ఈ నెల రోజులూ వాటిని పీకెయ్యాలని చాలా ప్రయత్నాలు చేశావు తెలివిలేని స్థితిలో. కాని మేము సడలనివ్వలేదు.

హాస్పిటల్‌లో గాలి పారే స్పెషల్ బెడ్ మీద నెల రోజుల నుంచీ వెల్లకిలా పడుకుని అనేక ట్యూబుల బంధనాల్లో ఉన్నదానివి ఇంట్లోని మంచం మీద పడుకోబెట్టగానే ప్రక్కకు తిరిగి చెయ్యి ముడుచుకుని పసిపిల్లలాగా సుఖంగా, నిశ్చింతగా పడుకున్నావు. నిన్ను హాస్పిటల్‌లో చేర్చడం సరైన పనేనా అన్న అనుమానాలు వచ్చాయి. కాల ప్రభావం ఎంత బలవత్తరమైందో తెలిసివచ్చినట్లయింది.

ఇంటికొచ్చిన మూడో రోజున నీవు ప్రక్కకు తిరిగినప్పుడు నీ కుడిచెయ్యి ఇనుప మంచానికి తగిలింది. 'ఠంగ్' మన్న శబ్దం వచ్చింది. ఆ శబ్దం కొత్తగా, వింతగా ఉంది. బ్రతికి వున్న చెయ్యి ఆ శబ్దం చెయ్యలేదు! ప్రాణం లేని లోహం ఇంకో లోహానికి తగిలినట్టి శబ్దం అది!

నీవు కళ్లు తెరిచావు... ఆ మసిబారిన చేతిని తేరిపార జూచావు. కొత్త వస్తువును చూసినట్లు నిదానంగా పరీక్షగా చూశావు. ఏమి అర్థం చేసుకున్నావో, ఏమనుకున్నావో నాకు తెలియదు. మరునాడు ప్రశాంతంగా దిండుకానుకుని పడుకుని ప్రాణం వదిలావు.

మనిషికీ, మనిషికీ మధ్యన ఉండగల సంబంధం లోతు ఎంతో?

ఆలోచనకు అందని ఆ సంబంధం స్వరూపం ఎలాంటిదో?

దాని మూలం ఎక్కడున్నది?

అమ్మా! నీవు ఎవరు? ఈ జీవనలీలలో నీ పాత్ర ఏమిటి?

నీ గురించి మనసులో మరుగుతున్న ఆవేశాలూ, ఆలోచనలూ ముగిసిపోయాయి. ఇప్పుడు నీవు లేవు. విచిత్రంగా నా పాత మనసు తాలూకు బరువులన్నీ రాలిపోతున్నవి. నేను చాలా తేలికైపోతున్నాను. నాకు బాంధవ్యాల బరువులు లేవు. లోక రీతి లేదు. నడవవలసిన దోవలు లేవు. బాధ్యతల ఎల్లలు లేవు! ఎంత స్వేచ్ఛ! నేను ఉన్నాను! ఒంటరితనంలోకి ఎదిగి, ఏకాకినై, సంపూర్ణనై, అమ్మనైపోతున్నాను! అమ్మా, ఇక సెలవు!

★★★